క్లుప్తంగా

నేడు కంటి వైద్యశిబిరం

సదుం: మండలంలోని ఊటుపల్లె పంచాయతీ బొమ్మిరెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నారు. సోమవారం ఈ మేరకు నిర్వాహకుడు మునుస్వామి మాట్లాడుతూ రుయా కంటి వైద్య నిపుణుల బృందం ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి, శస్త్రచికిత్స అవసరమైన వారిని గుర్తించనున్నట్లు వివరించారు.

వైభవంగా కుంభాబిషేకం



విశేష అలంకరణలో బాటగంగమ్మ

బైరెడ్డిపల్లి: స్థానిక బాటగంగమ్మ ఆలయ జీర్ణోద్ధరణ అనంతరం సోమవారం వైభవంగా కుంభాభిషేకం నిర్వహించారు. మహిళలు నడివీధి గంగమ్మ ఆలయం నుంచి బాటగంగమ్మ గుడి వరకు దీపాలతో ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే కార్వేటికొండ శ్రీధ్యానాభిరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ధ్వజారోహణం నిర్వహించారు. సాయంత్రం సింహవాహనంపై సీతాలక్ష్మణసమేతంగా స్వామివారిని ఊరేగించారు.

మానిటరింగ్ సమావేశం కోసం వినతి

గంగవరం: ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశాలను ప్రతి నెలా నిర్వహించాలని కోరుతూ మానిటరింగ్ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం ఈ మేరకు తహసీల్దార్ మురళీకి వినతిపత్రం సమర్పించారు. దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సభ్యులు డీవీ మునిరత్నం, బోయకొండయ్య, రెడ్డెప్ప పాల్గొన్నారు.

వేప కషాయంతో పురుగుల నివారణ



అవగాహన కల్పిస్తున్న ఏఓ సుధారాణి

రొంపిచెర్ల: పంటను ఆశించే పురుగుల నివారణకు వేప కషాయం పిచికారీ చేయాలని వ్యవసాయాధికారి సుధారాణి తెలిపారు. సోమవారం స్థానిక ఆర్బీకేలో పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వేప కషాయం తయారీపై అవగాహన కల్పించారు. వేప కషాయం వినియోగంతో మిత్ర పురుగులను కాపాడుకోవచ్చని సూచించారు. రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని, అప్పుడే ప్రభుత్వ పథకాలు అందుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఈఓ ఖాదర్‌వలీ, వ్యవసాయ సహాయకులు వెంకటరమణనాయక్, సుజాత, నర్మద పాల్గొన్నారు.

మండల మీట్ రేపు

రొంపిచెర్ల: ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి అధ్యక్షతన బుధవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్ర తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించనున్నట్లు వెల్లడించారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

కుప్పంరూరల్: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌లో భాగంగా బేస్‌బాల్ పోటీలకు మండలంలోని చందం పాఠశాల విద్యార్థినులు సుష్మా, ఉషారాణి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మోహన్‌సింగ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి కాకినాడలో నిర్వహించే స్కూల్ గేమ్స్‌లో విద్యార్థినులు పాల్గొననున్నట్లు వెల్లడించారు. విద్యార్థినులకు శిక్షణ ఇచ్చిన పీడీ లోకనాథంను అభినందించారు.

బీఎల్‌ఓలతో సమావేశం

సోమల: జాతీయ ఓటరు దినోత్సవాన్ని బుధవారం విజయవంతం చేయడంపై బీఎల్‌ఎలతో డీటీ ప్రకాష్‌బాబు సోమవారం సమావేశం నిర్వహించారు. పకడ్బందీగా కొత్త ఓటర్లను నమోదు చేయాలని సూచించారు.

వైఎస్సార్ కాంప్లెక్స్‌లోకి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కుప్పం: వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్‌లోకి కుప్పం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సోమవారం మార్చారు. రిజిస్ట్రేషన్ వచ్చిన వారితో కాంప్లెక్స్ కళకళలాడింది.

నాడు సంక్షోభం.. నేడు సంక్షేమం



ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

- పేదలందరికీ పథకాలు
- ప్రజలను మభ్యపెట్టేందుకే టీడీపీ పన్నాగాలు
- సీఎం జగనన్న వెంటే జనం
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్

పలమనేరు: గత టీడీపీ ప్రభుత్వంలో పట్టించుకునేవారు లేక పేదలు సంక్షభంలో ఉండేవారని, ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ సంబరాలు జరుపుకుంటున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. సోమ వారం మండలంలోని పెంగరగుంట, తావడపల్లె, ఏటిగడ్డిఇండ్లు, జంగాలపల్లె, కోతిగుట్టలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్ పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ హయాంలో అందిన పథకాలు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందిస్తున్న ఫలాలపై ప్రజలే ఆలోచించి అండగా నిలవాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో మాయమాటలతో జనాలను ఏమార్చి లబ్ధి పొందాలని టీడీపీ నేతలు పన్నాగాలు పన్నుతున్నారని ఆరోపించారు. అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నారని, వారి కల్లబొల్లి మాటలకు ఓట్లు రావని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే ప్రజలు మొగ్గుచూపుతున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే తమ గ్రామాలు అభివృద్ధి చెందాయని తెలిపారు. అనంతరం జంగాలపల్లెలో ఇటుకల పరిశ్రమను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బాలాజీనాయుడు, జెడ్పీటీసీ సభ్యులు మల్లిక రంగనాథం, ఎంపీపీ రోజా, వైస్ ఎంపీపీలు జయశ్రీ బాలాజీ నాయుడు, గజేంద్రన్, ఆస్పత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దయానందగౌడ, పీఏసీఎస్ అధ్యక్షుడు రాజారెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, సర్పంచులు తిరుమల, భువనేశ్వరి, మౌనిక, వసరాయప్ప, కుప్పయ్య, అనిల్ పాల్గొన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి

శాంతిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. సోమవారం కడపల్లె పంచాయతీ కర్లగట్ట, చిన్న కర్లగట్ట, చీమనపల్లెలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. లబ్ధిదారులకు సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందించారు. స్థానిక సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ వివక్షకు తావులేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వెల్లడించారు. ఒక్కో కుటుంబానికి వివిధ పథకాల ద్వారా సుమారు రూ.5లక్షల వరకు అందుతోందని వివరించారు. ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని చెప్పారు. విద్యావిప్లవం కారణంగా భవిష్యత్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటేలా తయారవుతున్నారని తెలిపారు. ఓట్ల కోసం అబద్ధపు హామీలు గుప్పించేవారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజాసేవే పరమావధిగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, ఎంపీపీ వసుంధర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, స్థానిక నేతలు కోదండరెడ్డి, సుకుమార్, జగదీష్, సర్పంచ్ గోవింద్, ఎంపీటీసీ సభ్యుడు చలం పాల్గొన్నారు.

పాఠశాలకు మొక్కలు



మొక్కలు నాటుతున్న ప్రధానోపాధ్యాయుడు తాతయ్య

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు సోమవారం ఉపాధ్యాయులు వంద మొక్కలను అందించినట్లు ప్రధానోపాధ్యాయుడు తాతయ్య తెలిపారు. మొక్కలను నాటడంతోపాటు సంరక్షణ బాధ్యత కూడా ఉపాధ్యాయులు తీసుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటసిద్ధులు, కన్నగి, పుష్పలత, వేణుగోపాల్, ప్రకాష్, మోహన్, మధుసూదన్‌రెడ్డి, పద్మవేణి పాల్గొన్నారు.

సచివాలయాల మండల కన్వీనర్‌గా కిషోర్‌రెడ్డి



వి.కోట: మండల సచివాలయల కన్వీనర్‌గా తోటకనుమ కిషోర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం సచివాలయ ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి పెద్దిరెడ్డి పర్యటనపై సమావేశం





సమావేశంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, రొంపిచెర్ల: మాట్లాడుతున్న రెడ్డీశ్వర్ రెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలో మంత్రి పెద్దిరెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి కోరారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా మంత్రి ఈనెల 25, 26, 29, 31 తేదీల్లో పర్యటించనున్నట్లు వివరించారు. అన్నిశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారాం, రెడ్డీశ్వరరెడ్డి, వల్లి వేడు రాజారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పోకల చంద్ర, నాగరాజ ప్రసాద్, ముర్షత్ బాషా, రాయల్‌మోహన్, తహసీల్దారు అమరనాథ్, ఎంపీడీఓ సుగుణమ్మ పాల్గొన్నారు.

రొంపిచెర్ల: మండలంలో ఫిబ్రవరి 1వ తేది నుంచి గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఈమేరకు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రెడ్డీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారం, ఎంఈఓ హసన్‌సాహెబ్, పీహెచ్‌సీ డాక్టర్ రాజా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, సర్పంచ్‌లు ఇబ్రహీంఖాన్, సుధారాణి, నాగిరెడ్డి, హేమలత, రమణయ్య పాల్గొన్నారు.

కుష్ఠు బాధితులకు వైద్యపరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

రొంపిచెర్ల: స్థానిక పీహెచ్‌సీలో సోమవారం కుష్ఠు వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డీపీఎంఓ రవికుమార్ మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిని తొలిదశలో గుర్తిస్తే అంగవైకల్యం కలగకుండా కాపడవచ్చన్నారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రాజా, దినేష్‌కుమార్ నాయక్, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజాక్షి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత





మాట్లాడుతున్న ఎంవీఐ మధుసూదన్, డ్రైవర్లకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

పలమనేరు/గంగవరం: రహదారి భద్రతను అందరూ బాధ్యతగా భావించాలని ఎంవీఐ మధుసూదన్ కోరారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ఎంవీఐ కార్యాలయంలో డ్రైవర్లకు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎంవీఐ మాట్లాడుతూ ప్రమాదాలకు డ్రైవర్ల నిర్లక్ష్యమే చాలావరకు కారణమన్నారు. నిబంధనలు పాటిస్తే సురక్షితంగా ప్రయాణించవచ్చని సూచించారు. కుప్పం పీఈఎస్ వైద్యులు పలువురు డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ బాబురెడ్డి

రామకుప్పం: మండలంలోని విజలాపురం పంచాయతీ బాలఓబనపల్లెలో సోమవారం భూగర్భ డ్రైనేజీ పనులను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ విజలాపురం బాబురెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. అందులోభాగంగా రూ.12.50 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభించామని చెప్పారు.గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్సీ భరత్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లిన సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రమణ్యం, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, పార్టీ మండల కో–కన్వీనర్ చంద్రారెడ్డి, చెంగారెడ్డి పాల్గొన్నారు.

లింగ వివక్ష చూపితే చర్యలు



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ భారతి

రొంపిచెర్ల: లింగ వివక్ష చూపితే కఠిన చర్యలు తప్పవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక కేజీబీవీలో బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల సంఖ్య మగవారి కంటే తగ్గుతోందన్నారు. కొందరు అమ్మ కడుపులోనే ఆడపిల్ల అని తెలుసుకుని భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఇది మంచి పద్ధతి కాదనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ సుజాత పాల్గొన్నారు.

సదుమమ్మకు ప్రత్యేక పూజలు



పత్యేకాలంకారంలో సదుమమ్మ, గంగమ్మ

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె సదుమమ్మ ఆలయంలో ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పీహెచ్‌సీకి వాటర్ ప్యూరిఫైయర్



ప్యూరిఫైయర్ అందిస్తున్న సుభాష్

రామకుప్పం: మండలంలోని విజలాపురం పీహెచ్‌సీకి గోవిందపల్లి గ్రామానికి చెందిన సుభాష్ వాటర్ ప్యూరిఫైయర్‌ను వితరణగా అందించారు. సోమవారం ఈ మేరకు వైద్యాధికారి అల్తాఫ్ హుస్సేన్‌కు అందజేశారు. దాత సుభాష్‌కు వైద్య సిబ్బంది, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాలు, భానుప్రకాష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై సమావేశం



సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: పట్టణంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఇటీవల చేపట్టిన వార్డు బాటలో ఆయన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారంపై సోమవారం సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణంతో సమీక్షించారు. అలీమ్‌బాషా మాట్లాడుతూ వార్డు బాటలో మొత్తం 162 వినతులు అందగా ఎంపీ ఆదేశాల మేరకు అన్నింటినీ పరిష్కరిస్తున్నామన్నారు. సమావేశంలో ఎంపీ పీఏలు రాజు, దస్తగిరితో పాటు వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహులు, శ్రీనివాసులు, రాజేష్ పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ రెడ్డెప్ప

పెద్దపంజాణి: మండలంలోని చలమంగలం గ్రామ సచివాలయాన్ని ఎంపీపీ ఎస్. రెడ్డెప్ప సోమవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం 3 నుంచి 5 వరకు తప్పనిసరిగా స్పందన కార్యక్రమం నిర్వహించాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని సూచించారు.



సత్తా చాటిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

క్రీడల్లో విద్యార్థినుల ప్రతిభ

పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేట మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థిని కె.జ్యోతి అండర్–17 అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణ పతకం గెలుచుకుంది. ఇదే పాఠశాల విద్యార్థిని మహాలక్ష్మి ప్రశంసా పత్రం అందుకుంది. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినులను ప్రిన్సిపల్ జోత్స్న, పీడీ నాగమ్మ అభినందించారు.

కో–ఆప్షన్ సభ్యుడికి పరామర్శ



మస్తాన్ సాహెబ్‌ను పరామర్శిస్తున్న పెద్దిరెడ్డి

సోమల: మండల కో–ఆప్షన్ సభ్యుడు మస్తాన్ సాహెబ్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సోమవారం పరామర్శించారు. ఆందోళన వద్దని తమ కుటుంబం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్, వైఎస్సార్‌సీపీ నేత మహబూబ్‌బాషా (మబ్బి) పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ వాసవీమాత



ఆత్మార్పణ దినోత్సవం నిర్వహిస్తున్న మహిళలు

వి.కోట: వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, ఆలయంలో హోమం చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.

పలమనేరు: ఆర్యవైశ్యుల కులదేవత కన్యకాపరమేశ్వరి పవిత్రాగ్నిలో ప్రవేశించి ఆత్మార్పణ చేసుకున్న రోజును పురస్కరించుకుని వాసవీ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవి క్లబ్ ఆఫ్ వనిత సభ్యులు పాల్గొన్నారు.

చిరస్మరణీయులు 'నేతాజీ'





పలమనేరు : నేతాజీ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం, చౌడేపల్లె: ప్రభుత్వ కళాశాలలో..

పలమనేరు: పట్టణంలోని గ్రంథాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోష్ జయంతిని సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లైబ్రేరియన్ హేమంత్ మాట్లాడుతూ నేతాజీ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆజాద్ హింద్‌ఫౌజ్ స్థాపించి బ్రిటిష్ వారితో పోరాటం చేశారని వెల్లడించారు. స్వాతంత్రోద్యమంలో బోస్ పాత్ర కీలకమని కొనియాడారు. కార్యక్రమంలో నందగోపాల్, ఆంజనేయులు పాల్గొన్నారు.

చౌడేపల్లె: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుభాష్‌చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ బాలకృష్ణ, అధ్యాపకుడు బాలాజీ పాల్గొన్నారు.

సోమల: ఎస్‌కేవీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జయరాం, అధ్యాపకులు బట్టు శివయ్య, రవీంద్రారెడ్డి, నాగరత్న పాల్గొన్నారు.

కుప్పం: పట్టణంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ సుధీర్ పూలమాల వేసి నివాళులర్పించారు. స్వతంత్ర పోరాటంలో ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిరెడ్డి పాల్గొన్నారు.



సోమల: మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జయరాం



కుప్పం: నేతాజీకి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్

26 నుంచి ప్లాస్టిక్ కవర్లపై నిషేదం

పలమనేరు: పట్టణంలో 26వ తేదీ నుంచి ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై నిషేధం అమలవుతుందని కమిషనర్ కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 120 మైక్రాన్ల లోపు కవర్లను అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.